


నల్లగొండ సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

11 బుధవారం నవంబర్ 2026 పేజీలు: 3

అమెరికాలో అదృశ్యమైన నల్గొండ యువతి ఆచూకీ కోసం ప్రయత్నాలు



- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నిరంతర సంప్రదింపులు
- బోస్టన్ పోలీసులతో సమన్వయం

నల్గొండ- నవంబర్ 10(సత్యనిష్ఠ): అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న నల్గొండకు చెందిన కోయ శ్రీజా రెడ్డి ఆచూకీ కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. శ్రీజా ఆచూకీని త్వరగా కనుగొనాలని ఇప్పటికే బోస్టన్ భారత కాన్సులేట్ జనరల్, కేంద్ర విదేశాంగ శాఖ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖల ద్వారా విజ్ఞప్తి చేశారు. తాజాగా బోస్టన్‌లోని తానా ప్రతినిధి కృష్ణప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, శ్రీజా ఆచూకీ కోసం స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు వేగవంతం చేయాలని కోరారు. మంత్రి పంపిన లేఖల ఆధారంగా స్థానిక పోలీసుల సహకారంతో శ్రీజా ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని తానా ప్రతినిధి కృష్ణప్రసాద్ మంత్రికి వివరించారు. బోస్టన్ పోలీసులకు తానా ప్రతినిధులు ఇప్పటికే ఫిర్యాదు చేయడంతో పాటు, కేసు దర్యాప్తు పురోగతి, తాజా వివరాలు తెలుసుకునేందుకు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి అధికారులతో మాట్లాడారు. శ్రీజ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్న నేపథ్యంలో, ఆమె ఆచూకీ లభించి క్షేమంగా తిరిగి వచ్చే వరకు ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని బోస్టన్ కాన్సులేట్ జనరల్‌ను మంత్రి కోరారు. మంత్రి ఆదేశాల మేరకు మంత్రి కార్యాలయం నుంచి ప్రతి గంటకోసారి సంబంధిత అధికారులతో సంప్రదిస్తూ దర్యాప్తు పురోగతి, తాజా వివరాలను సేకరిస్తున్నారు. శ్రీజ త్వరలోనే సురక్షితంగా ఆచూకీ లభిస్తుందనే ఆశాభావంతో కుటుంబ సభ్యులు, తానా ప్రతినిధులు, అధికారులు ఎదురుచూస్తున్నారు.

జాతీయ స్థాయి త్రో బాల్ పోటీల్లో స్వర్ణ పతకం

- తెలంగాణకు గర్వకారణంగా నిలిచిన అక్షిత
- భారత జట్టుకు ఎంపిక



చింతపల్లి – నవంబర్ 10 (సత్య నిష్ఠ): చింతపల్లి మండలం చాకలి శేరిపల్లి గ్రామానికి చెందిన అక్షిత జాతీయ స్థాయి త్రో బాల్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించి తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని కోయంభత్తూరులో నిర్వహించిన జాతీయ స్థాయి త్రో బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున పాల్గొన్న అక్షిత అద్భుత ప్రతిభ కనపరిచి స్వర్ణ పతకాన్ని సాధించి, తన ప్రతిభతో జాతీయ స్థాయిలో సత్తా చాటిందని, భారత జట్టుకు ఎంపికైన సందర్భంగా కే టి ఆర్ హర్షం వ్యక్తం చేశారు. అక్షితకు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రామావత్ రవీంద్ర కుమార్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఆర్థిక సహాయాన్ని కే టి ఆర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, పి ఏ సి ఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మాచర్ల శ్రీశైలం, అండేకర్ అశోక్, ఉప సర్పంచ్ పగడాల వెంకటయ్య, తండ్రి జగతయ్య తదితరులు పాల్గొన్నారు.

చింతాబాబు మాదిగకు 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్' జాతీయ పురస్కారం

సామాజిక, బహుజన సేవలకు లభించిన అత్యుత్తమ గుర్తింపు.



కోదాడ నవంబర్ 10 సత్యనిష్ఠ:బహుజన హక్కుల పోరాట యోధుడు, ఎమ్మార్పీఎస్ కీలక నేత చింతాబాబు మాదిగను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు వరించింది. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ ఈ పురస్కారాన్ని ప్రకటించగా, ఈ నెల 15న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నట్లు చింతాబాబు మంగళవారం వెల్లడించారు.గత మూడు దశాబ్దాలుగా సామాజిక రంగంలో చింతాబాబు సేవలు అందిస్తున్నారు. 1990లలో మార్గదర్శి యూత్, స్ఫూర్తి యూత్ సంస్థల ద్వారా యువతను చైతన్యపరుస్తూ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. గతంలో ఫ్రెండ్‌షిప్ సొసైటీ అవార్డులు, 'దళిత రత్న' పురస్కారం పొందడంతో పాటు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా 'మాదిగ బంధు' బిరుదును అందుకున్నారు. జాతీయ స్థాయిలో అంబేద్కర్ అవార్డు ప్రకటనపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

జర్నలిస్టుల సంక్షేమానికి టియుడబ్ల్యుజే కృషి అభినందనీయం

- వికారాబాద్ సభలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- అక్రెడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలపై హామీ



వికారాబాద్ – నవంబర్ 10 (సత్య నిష్ఠ): రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం దశాబ్దాల తరబడి టి యు డబ్ల్యు జే చేస్తున్న కృషి అభినందనీయమని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం నాడు వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి ఫంక్షన్ హాలులో జరిగిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం వికారాబాద్ జిల్లా తృతీయ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో ఎంతో గౌరవప్రదమైన జర్నలిజం వృత్తి పక్కదారి పట్టకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీడియా సంస్థలపై, జర్నలిస్టులపై ఉంటుందని స్పీకర్ సూచించారు. ముఖ్యంగా ప్రజలకు పక్షపాతిగా వ్యవహరిస్తూ, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు జర్నలిస్టులు చురుకైన పాత్ర పోషించాలని, సంచలనాలు, కల్పితాలు, అవాస్తవాలకు దూరంగా వృత్తి ధర్మాన్ని పాటిస్తూ, నిజాయితీగా సమాచారాన్ని అందించే మీడియా సంస్థలను, జర్నలిస్టులను ప్రజలు అక్కున చేర్చుకుంటారని ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, దశల వారీగా వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు అన్నారు. వికారాబాద్ జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు అందించామని, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల కోసం తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సభకు గౌరవ అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతూనే మరోవైపు జర్నలిస్టుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు తమ సంఘం 75 ఏండ్లుగా కృషి చేస్తుందని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులకు అందుతున్న సౌకర్యాలన్నీ తమ సంఘం పోరాట ఫలితమేనన్నారు. రాష్ట్రంలో అకాల మరణం చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం, జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులను అందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విరాహత్ అలీ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు మీడియా అకాడమీ నుంచి ప్రస్తుతం అందిస్తున్న తక్షణ సహాయాన్ని లక్ష రూపాయల నుంచి 2 లక్షలకు పెంచాలని, ఐదేళ్ల పాటు ప్రతి నెల మృతుని భార్యకు చెల్లించే 3 వేల రూపాయల పెన్షన్‌ను 10 వేల రూపాయలకు పెంచాలని కోరారు. ఇంకా ఈ సభలో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, తాండూర్ శాసన సభ్యులు మనోహర్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య, టి యు డబ్ల్యు జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, ఐ జే యు జాతీయ ఉపాధ్యక్షులు వై. నరేందర్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహాచారీ, శ్రీధర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీంలతో పాటు దాదాపు 300 మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయాలి

- మహాసభల ప్రచార కరపత్రాల విడుదల
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపు



నల్గొండ - నవంబర్ 10 (సత్య నిష్ఠ):అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మహాసభలు నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నల్గొండలో జరగనున్న నేపథ్యంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి, ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత మాట్లాడుతూ అఖిల భారత కిసాన్ సభ 1936లో స్థాపించబడిందని, రైతుల సమస్యల పరిష్కారం, వ్యవసాయ కార్మికుల హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. గిట్టుబాటు ధరలు, సాగు ఖర్చులు, వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గడం, గ్రామీణ ప్రజల జీవనోపాధి వంటి అంశాలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్తు పోరాట కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. నవంబర్ 15న మధ్యాహ్నం 3 గంటలకు నల్గొండలోని ఎంజీ కాలేజ్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభకు మహిళలు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి, జిల్లా అధ్యక్షురాలు వెంకట చంద్ర, ఆఫీస్ బేరర్స్ అండం నారాయణమ్మ, షేక్ ఖుజ్జి, కమిటీ సభ్యులు సుందరి రమాదేవి, గోలి భాగ్యమ్మ, కొప్పుల రజిత తదితరులు పాల్గొన్నారు.

కలమ్మ మృతి పట్ల బీజేపీ నాయకుల సంతాపం



సత్య నిష్ఠ ఆర్ సి హుజూర్‌నగర్ గరిడేపల్లి: గరిడేపల్లి మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సీనియర్ నాయకులు మాతంగి బేబీ సతీమణి కలమ్మ గారు మృతి చెందడం పట్ల మండల, జిల్లా స్థాయి బీజేపీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కలమ్మ గారి భౌతికకాయానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబానికి అండగా నిలుస్తూ నగదు రూపంలో ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ఓబీసీ మోర్చా ఐటీ సెల్ కన్వీనర్, హుజూర్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కో-కన్వీనర్ అనంతు గురువయ్య గౌడ్, గరిడేపల్లి మండల బీజేపీ అధ్యక్షులు కుక్కడపు వెంకటేశ్వర్లు గౌడ్, జిల్లా కౌన్సిలింగ్ మెంబర్ నర్సింగ్ అంజయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పిడమర్తి అశోక్ కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపాటి రాజు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిస్సహాయ కుటుంబానికి అపన్నహస్తం అందించిన జనయేత్రీ ఫౌండేషన్

- బంటు వెంకన్న కుటుంబానికి 41 వేల రూపాయల ఆర్థిక సహాయం
- మూడు రోజుల్లోనే స్పందించిన సభ్యులు



మిర్యాలగూడ – నవంబర్ 10 (సత్య నిష్ఠ): డా.మునిర్ అహ్మద్ షరీఫ్ పిలుపు మేరకు మానవత్వంతో స్పందించిన సభ్యులు నిస్సహాయ కుటుంబానికి అపన్నహస్తం అందించారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బంటు వెంకన్న కుటుంబానికి జనయేత్రీ ఫౌండేషన్ 41 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసింది. కేవలం మూడు రోజుల వ్యవధిలో జనయేత్రీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. మునిర్ అహ్మద్ షరీఫ్ పిలుపు మేరకు ఫౌండేషన్ కుటుంబ సభ్యులు తక్షణమే స్పందించి వారికి తోచిన సహాయం పంపడం అభినందనీయమని స్వాతి ట్రావెల్స్ అధినేత కంచరకట్ల దయాకర్ రెడ్డి అన్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిలబడి సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపిన జనయేత్రీ ఫౌండేషన్ అధ్యక్షులు పల్లె కిశోర్ కుమార్, డా. మునిర్ అహ్మద్ షరీఫ్ సేవా స్ఫూర్తితో నిరాశ్రయులకు, నిస్సహాయులకు నిస్వార్థ సేవ చేసేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని అన్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అని పెద్దలు అంటారని, అందుకే సమాజానికి సేవ చేసే అవకాశం వచ్చినప్పుడు వదలకుండా తన పరిధి మేరకు సేవ చేయాలనే మంచి సంకల్పంతో తాను ఐదు సంవత్సరాల క్రితం జనయేత్రీ ఫౌండేషన్ ఏర్పాటు చేసి, మానవత్వంతో సాటి మనిషి కష్టం చూసి చలించే మానవతా వాదులను సభ్యులుగా చేర్చుకోవడం, వారందరి సహాయ సహకారాలతో పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించడం, వృద్ధులు, నిస్సహాయుల ఆశీస్సులు పొందడం తన అదృష్టంగా భావిస్తున్నానని జనయేత్రీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. మునిర్ అహ్మద్ షరీఫ్ అన్నారు.

రసాయన రహిత వరి సాగు చేయాలి

- ముఖ్యమంత్రికి వ్యవసాయ జర్నలిస్ట్ మొలుగూరి గోపి వినతి
- గ్రామ స్థాయికి డాక్టర్లు, ల్యాబ్‌లు చేరే ప్రమాదం



కోదాడ – నవంబర్ 10 (సత్య నిష్ఠ): గత 65 ఏళ్లుగా రసాయన వ్యవసాయం వల్ల భూసారం దెబ్బతిన్నదని, మరో 5, 6 సంవత్సరాలు పోతే సాగుకు పనికి రాదని, రసాయన ఆహారం వల్ల మరో 4, 5 సంవత్సరాల్లో ప్రతి ఇంటికి క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని సూర్యాపేట జిల్లా వ్యవసాయ జర్నలిస్ట్, రైతు మొలుగూరి గోపి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి విన్నవించారు. మధుమేహం, రక్తపోటు, కిడ్నీ సమస్యలు పెరగడంతో మెడికల్ షాపులు, హాస్పిటల్స్, ల్యాబ్‌లు గ్రామాల్లోకి కూడా వచ్చాయని, పంజాబ్‌లో మాదిరిగా మన రాష్ట్రం కూడా మారే ప్రమాదం ఉందని అన్నారు. ప్రకృతి వ్యవసాయం పై సేవ్ సాయిల్ ప్రాజెక్ట్ అమలు చేయాలని, తొలి విడతగా పంద కోట్ల రూపాయలతో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అనుభవం ఉన్న రైతులు, నిపుణులు, విశ్రాంత ఐ ఏ ఎస్ అధికారులతో, ఎం ఎల్ ఏలు, మంత్రుల పర్యవేక్షణలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి రైతు ముందుగా అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేయాలనే నిబంధన పెట్టాలని కోరారు. నేల ఆరోగ్యమే పంట ఆరోగ్యం, పంట ఆరోగ్యమే మన ఆరోగ్యం అనే నినాదంతో ముందుకు వెళ్లాలని, గత నాలుగు సంవత్సరాలుగా తాను జిల్లా వ్యాప్తంగా రైతు చైతన్య యాత్ర నిర్వహిస్తున్నానని, ఆంధ్రప్రదేశ్‌లో 2016 నుంచి విజయ్ కుమార్ సారథ్యంలో రైతు సాధికార సంస్థ ద్వారా పైలెట్ ప్రాజెక్టు నడుస్తోందని, మన రాష్ట్రంలో కూడా అమలు చేసి భవిష్యత్ తరాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు అండగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి..

- ధాన్యం ధర క్వింటాల్‌కు రూ.3,500 తగ్గకుండా కొనుగోలు చేయాలి
- రైస్ మిల్లర్లకు ఎమ్మెల్యే సూచన
- ప్రతి రైస్ మిల్లులో రూ.3,500 తగ్గకుండా ధాన్యం కొనుగోలు చేస్తాం
- రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రకటన



సత్యనిష్ఠ,మిర్యాలగూడ, నవంబర్ 10 : నియోజకవర్గంలో ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో వెంటనే స్పందించిన మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రైతులకు నష్టం కలగకుండా ధాన్యం క్వింటాల్‌కు రూ.3,500 తగ్గకుండా కొనుగోలు చేయాలని రైస్ మిల్లర్లకు హెచ్చరించారు.రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, రైతులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు...అనంతరం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని ప్రతి రైస్ మిల్లులో ధాన్యం క్వింటాల్‌కు రూ.3,500 తగ్గకుండా కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ధాన్యం నాణ్యత బాగుంటే రూ.3,500 కంటే ఎక్కువ ధర కూడా చెల్లిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ధర కంటే తగ్గించి కొనుగోలు చేయబోమని రైతులకు హామీ ఇచ్చారు.రైతుల ఆందోళనను వెంటనే గుర్తించి, రైస్ మిల్లర్లతో చర్చించి రైతులకు భరోసా కల్పించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చొరవపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంఘ సమస్యలపై అవిశ్రాంత పోరాటం చేస్తాం

- నగదు రహిత వైద్య సేవలపై అపోహలు వద్దు.
- విశ్రాంత ఉద్యోగుల హక్కులకై పోరాడతాం.
- విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ రెడ్డి...



కోదాడ నవంబర్ 10 సత్యనిష్ఠ: విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర నాయకత్వం రాజీలేని పోరాటం అవిశ్రాంతంగా చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని ఫంక్షన్ హాల్ లో విశ్రాంత ఉద్యోగుల సంఘం సూర్యాపేట జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నగదు రహిత వైద్య సేవలపై ఎవరు కూడా అపోహలు పెట్టుకోవద్దని పూర్తిస్థాయిలో అందరికీ వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో తమ సంఘం రెండున్నర లక్షల సభ్యత్వం కలిగి ఉందన్నారు. పి ఆర్ సి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే అమలు చేస్తే జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య మాట్లాడుతూ సంఘ సభ్యులందరూ ఐక్యంగా ఉంటేనే సమస్యలను పరిష్కరించుకోగలమని అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు సంఘ సమస్యలపై జరిగే ఐక్య ఉద్యమాలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లాలోని అన్ని మండలాల వారిగా పలు సమస్యలపై విస్తృతంగా చర్చించారు. విశ్రాంత ఉద్యోగుల మేధోశక్తి ఈ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కీలకమన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు తో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన సంఘ సభ్యులను శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోదాడ అసోసియేషన్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు, జిల్లా ఇన్చార్జ్ అధ్యక్షులు కే రవీందర్ రెడ్డి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉస్మాన్ పాష, ప్రసాదరావు, శ్రీనివాసరెడ్డి, విద్యాసాగర్,పొట్ట జగన్మోహన్, రఘువర ప్రసాద్ అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లోన్ యాప్ వేధింపులతో కానిస్టేబుల్ మృతి

- ముడావత్ శ్రీను కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- బాధ్యులను కఠినంగా శిక్షించాలి



రంగారెడ్డి – నవంబర్ 10 (సత్య నిష్ఠ): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం హర్షగూడ గ్రామానికి చెందిన, కొండాపూర్ బెటాలియన్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ముడావత్ శ్రీను ఆన్‌లైన్ మొబైల్ లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని బి సి జే ఏ సి రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కేవలం రూ. 40 వేల రుణం తీసుకున్న శ్రీను, సకాలంలో తిరిగి చెల్లించినప్పటికీ లోన్ యాప్ నిర్వాహకులు అతనిని వేధించడం దారుణమని, అంతేకాకుండా అతని కుటుంబ సభ్యుల ఫొటోలు, భార్యకు సంబంధించిన మార్ఫింగ్ చేసిన అసభ్యకర చిత్రాలను బంధువులకు పంపిస్తామని బెదిరించడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వేధింపుల కారణంగానే శ్రీను ఆత్మహత్యకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఒక కానిస్టేబుల్‌కే ఆన్‌లైన్ లోన్ యాప్ నిర్వాహకుల వేధింపుల నుంచి రక్షణ లేకపోతే, ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి అక్రమ ఆన్‌లైన్ లోన్ యాప్‌ల వల్ల ఎంతోమంది పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి తక్షణమే స్పందించాలని, మృతుడు ముడావత్ శ్రీను కుటుంబానికి రూ. 50 లక్షల ఆర్థిక సహాయం అందించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు. అలాగే ఈ ఘటనకు కారకులైన ఆన్‌లైన్ లోన్ యాప్ నిర్వాహకులను గుర్తించి, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా అక్రమ లోన్ యాప్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వాటి వేధింపులకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మిల్లర్లతో కుమ్మక్ వడ్ల రేట్లు తగ్గించిన ప్రభుత్వం

బెల్లంకొండ సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి



కోదాడ నవంబర్ 10 సత్యనిష్ఠ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లతో కొమ్మక్కై వడ్ల రేట్లు అమాంతం 1500 రూపాయల వరకు తగ్గించినది, మిల్లర్లు లబ్ధి కొరకే అని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్య నారాయణ అన్నారు. ఈరోజు కోదాడ నియోజకవర్గ పరిధిలోని నడిగూడెం మండలం వేణు గోపాలపురంలో ఈనెల 15వ తారీకు నల్లగొండ పట్టణంలో జరిగే ఆలిండియా రైతు సంఘం మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహిస్తూ బెల్లంకొండ సత్యనారాయణ మాట్లాడరూ ధాన్యానికి 4200 నుండి 4,500 వరకు క్వింటాల్ వరి ధాన్యం అమ్ముతుండగా ప్రభుత్వంతో మిల్లర్లు కుమ్మక్కై 3200 వరకు నేడు అమ్మే పరిస్థితి వచ్చిందని రైతులు ఎన్నో కష్ట నష్టాలను ఓర్చి సాగు నీరు లేక విద్యుత్ సమస్యల తోనే తుఫాను ప్రభావం వల్ల ఎన్నో రకాలుగా నష్ట పోతున్న రైతుని ప్రభుత్వము, దళారులు మోసం చేసి రైతుని ఇంకా నష్ట పరుస్తున్న పరిస్థితి కళ్ళకు కట్టినట్టుగా కనపడు తుందని ఆయన అన్నారు. పంటలు రైతు చేతి నుండి మిల్లుకు చేరిన తర్వాత బియ్యం ధరలను పెంచి ప్రజలని మోసం చేస్తున్నారని మధ్య దళారులు బాగు పడు తున్నారని అన్నారు. రైతుల శ్రమకు తగిన గౌరవం కల్పించి వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే సరైన రేట్లు వచ్చే విధంగా చూడాలని బెల్లంకొండ సత్య నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ యొక్క ప్రచార కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్ రైతు సంఘం నాయకులు రేఖ తిరుపయ్య, సంపత్ పిచ్చయ్య, కిన్నెర వెంకన్న, కందుల సంజీవరావు, వీరస్వామి, సత్యం, నరేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- పేద ప్రజలకు వరం సి ఎం రిలీఫ్ ఫండ్
- రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి చేతుల మీదుగా అందజేత

చిట్యాల – నవంబర్ 10 (సత్య నిష్ఠ): ఈ రోజు ఉరుమడ్ల దగ్గర చిట్యాల గ్రామానికి చెందిన పాకాల రాములమ్మ, బోయ సతెమ్మ, శ్యాం సుందర్ రెడ్డి, మర్రి మాధవిలకు సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ సి ఎం రిలీఫ్ ఫండ్ పథకం పేద ప్రజలకు వరమని తెలిపారు. ఈ పథకం ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం సి ఎం ఆర్ ఎఫ్ పథకాన్ని చాలా అద్భుతంగా అమలు చేస్తోందని చెప్పారు.